# బిజినెస్




ఏ చికాకులూ లేకుండా వ్యవహారాలన్నీ సజావుగా సాగిపోవాలనే ప్రతి బిజినెస్‌మాన్ కోరుకుంటాడు. ఇంచుమించు రావు ఉద్దేశం కూడా అదే... కాని సాఫీగా, హాయిగా సాగిపోతున్న వ్యాపారంలో అనుకోకుండా చిన్న చిక్కొచ్చింది. ఆ చిన్న చిక్కు విడదీయటానికి తను స్వయంగా కదిలి హైద్రాబాద్ వెళ్ళటమా, ఎవర్నైనా పంపటమా అని కొంచెం ఆలోచించాడు రావు. పెద్ద కారణం ఏం లేకపోయినా ఎందుకో తనే స్వయంగా వెడితే మంచిదనిపించింది.

ఎదుగుతున్న వ్యాపారంలో చికాకులు తప్పవని రావుకి తెలుసు. వాటికి భయపడి చేతులు ముడుచుకు కూచోటం రావు తత్వం కాదు. అందులో ఈమధ్య మరో కొత్త ప్రాడక్ట్ మొదలుపెట్టటం... ఆ తతంగంలో కావాల్సిన వాళ్ళని చేరదీసుకోవటం, కొంతమందిని కావాలని దూరం చేసుకోవటం... ఈ

రకం హడావిడిలో వేడెక్కిన మెదడుని కాస్త చల్లగాలికి వదలటం మంచిదనిపించింది. స్వయంగా హైద్రాబాద్ రావటానికి అదో కారణం.

రావాల్సిన వాళ్ళు వచ్చే సమయం అయిందని నెమ్మదిగా మంచం మీంచి లేచి ముందు గదిలోకి వచ్చాడు. ఏ విషయం మీద సంభాషణ జరుగుతుందో వూహిద్దామన్నా ఆలోచనకి అందలేదు. స్టేట్ లెవెల్ డిస్ట్రిబ్యూటర్ పెద్ద ఆర్డరిచ్చి, తిరిగి ఆర్డర్ కేన్సిల్ చేశాడంటే చిన్న విషయం కాదని తెలుసు... అయినా మూడ్‌ని చాలా నార్మల్‌గా వుంచుకోవాలనే ప్రయత్నం చేస్తున్నాడు రావు. వచ్చే వాళ్ళు ఎంత హఠాత్తుగా వచ్చినా, అప్పుడు తన మూడ్ ఎంత దారుణంగా వున్నా, వాళ్ళని చూసీ చూడగానే మామూలు బిజినెస్ స్మైల్‌ని తన ముఖంలోకి తెచ్చుకోగలనన్న నమ్మకం వుంది రావుకి... పైగా ఆ ప్రమాదం లేకుండా గేటు దగ్గర రంగడున్నాడు వాళ్ళు రాగానే వొచ్చి చెప్పటానికి...

మనసు రాబోయే చిదంబరం మీదకి, జరగబోయే సంభాషణ మీదకీ పోతోంది. అందుకని మనసు మారటానికి ఏదో మేగజైన్ తిరగేస్తూ కూచున్నాడు. రంగడొచ్చి ఎవరో వచ్చారని చెప్పేవరకూ అలాగే కూచున్నాడు రావు.

అవసరం లేకపోయినా, లేవాలని లేకపోయినా కర్టెసీ కోసం కొద్దిగా లేచి... "రండి... రండి..." అన్నాడు రావు వాళ్ళని చూడగానే...

బోల్డంత పెద్ద నవ్వుని ముఖానికి తగిలించి చేయి చాపుతూ ముందుకొచ్చాడు చిదంబరం. కోటు పిటపిట లాడుతోంది. పేంటు బొడ్డు కిందకి జారిపోయి పొట్ట అడుగున యిరుక్కుపోయింది.

చేతులు కలుపుకునే మర్యాద అయిపోయాక స్థిమితంగా సోఫాల్లో చేరారు.

"అన్నట్టు రావుగారు.... యితను కామేశ్వర్రావని, కొత్తగా మన దగ్గర చేరాడు. వర్కింగ్ పార్ట నర్" అన్నాడు చిదంబరం.

రావు షేక్‌హాండిస్తూ అతని ముఖంవేపు చూశాడు. సన్నగా నీటుగా వున్నాడు. ముఖమంతటిలో కొట్టొచ్చినట్టు పొడుగ్గా పెద్ద ముక్కు ముందు రావు దృష్టిలో పడింది.

పొడుగు ముక్కు వాళ్ళంటే రావుకంత యిష్టం లేదు. అలాంటివాళ్ళు జిడ్డుగా ఆర్గ్యూ చేస్తారని రావు నమ్మకం.

"చిదంబరం, కామేశ్వరరావుని సరదాకి కూడా తీసుకురాలేదని గ్రహించటానికి రావు కెంతోసేపు పట్టలేదు.

ఫార్మాలిటీస్ అన్నీ అయిపోయాక నెమ్మదిగా మొదలెట్టాడు చిదంబరం.

"పని మీదే వచ్చారా హైద్రాబాద్" అని.

"అబ్బే లేదండీ.... రాత్రికి నా క్లోజ్ ఫ్రెండింట్లో ఫంక్షనుంది... నేను రాకపోతే చాలా బాధపడతాడని ఎన్ని పనులున్నా వొదులుకుని వచ్చాను. సరిగ్గా బైలుదేరే టైముకి మీ టెలిగ్రాం వచ్చిందని మేనేజర్ తీసుకొచ్చి యిచ్చాడు..." అన్నాడు. తనంతగా తను బైటపట్టం రావుకి యిష్టంలేదు. కేన్సిలైన ఆర్డర్ ఏమంత పెద్ద విషయం కాదన్నట్టే మాట్లాడాలని నిశ్చయించుకున్నాడు.

"మీ దగ్గర డిస్ట్రిబ్యూషన్ తీసుకున్న దగ్గిర్నించీ యిదే మొదటిసారి యిచ్చిన ఆర్డర్ కేన్సిల్ చెయ్యటం..." అన్నాడు చిదంబరం నవ్వు, ఏడుపు రెండూ ముఖానికి అతికించుకుని.

అవునన్నట్టు తలూపాడు రావు.

"అసలేం జరిగిందంటే..." అంటూ ఆగిపోయాడు చిదంబరం. కామేశ్వరరావు వేపు చూస్తూ... ఇంక తరువాయి కామేశ్వరరావు మొదలెడతాడని రావుకి తెలిసిపోయి అతనివేపు తిరిగాడు.

"అది కాదు రావుగారు యింకొకళ్ళు యింకొకళ్ల అయితే ఎలాగోలాగ మాట్లాడచ్చు. కానీ మీ దగ్గర మటుకు వున్న విషయం సూటిగా చెప్పేయాలని నాకు తెలుసు. యింతకు ముందు మిమ్మల్ని చూడకపోయినా మీ గురించి చిదంబరంగారి ద్వారా, యింకా మిగిలిన బిజినెస్ మాగ్నెట్స్ ద్వారా చాలా విన్నాను" అన్నాడు కామేశ్వరరావు ఉపోద్ఘాతం చెపుతున్నట్టు.

కొద్దిగా నవ్వటం తప్ప రావేం మాట్లాడలేదు. కామేశ్వరరావు దగ్గర మాటల విషయంలో కూడా బిజినెస్ చెయ్యటం అవసరమనిపించింది రావుకి మనసులో...

"కిందటిసారి కంటే ఈసారి ఆర్డర్ పెంచే పంపాం. కానీ, తీరా పంపించేశాక... కైలాష్ వాళ్ళు కాంటాక్ట్ చేశారు యిదే ప్రొడక్ట్ విషయం... నాకు కొంచెం పరిచయం వుంది వారితోటి... నేను చిదంబరంగారి దగ్గర చేరానని తెలిసివాళ్ళే కొంచెం చనువు తీసుకున్నాను. మన ప్రొడక్ట్ని, వాళ్ళ ప్రొడక్ట్ని పోల్చడం కాదనుకోండి... అయినా డిస్ట్రిబ్యూషన్ బిజినెస్ మీకు తెలియందేముంది. మీకు పంపించిన ఆర్డర్ తీసి చూపించాను కూడా. అదే ఆర్డర్ వాళ్ళకిస్తే పదిహేను పెర్సంట్ ఎడిషనల్ డిస్కౌంట్ యిస్తామన్నారు" అన్నాడు కామేశ్వరరావు.

తల కొంచెం పైకెత్తి సూటిగా కామేశ్వర్రావు కళ్ళల్లోకి చూశాడు రావు. నెమ్మదిగా నవ్వటం తప్ప, తల దించుకోలేదు కామేశ్వర్రావు.

ఆర్డర్ యిచ్చి తర్వాత కాన్సిల్ చెయ్యటం ఏం బావుండలేదంటూ మోరల్స్ మాట్లాడి ప్రయోజనం లేదనిపించింది రావుకి.

"సరే అయితే ఏం చేద్దామంటారు..." అన్నాడు.

చిదంబరం కదలకుండా గుమ్మడికాయలా కూర్చున్నాడు.

కొంచెం మనిషి వులిక్కిపడ్డట్టు కనిపించినా... "భలేవారే సార్... నన్నడుగుతారేమిటండీ..." అంటూ కొంచెం గట్టిగా నవ్వాడు కామేశ్వర్రావు.

ఇంక లాభం లేదనిపించింది రావుకి. ఇటువంటి పరిస్థితిలో పది మాటలు పెంచాల్సిన అవసరం లేదని గ్రహించే అనుభవం లేకపోలేదు రావుకి. ఎందుకేనా మంచిదని...

"కైలాష్ వాళ్ళు ఈమధ్యనే రేట్లు పెంచారు. మీకు తెలుసు కదూ" అన్నాడు సూటిగా చెప్పకపోయినా రేట్లు పెంచటం వల్లే డిస్కౌంట్ పెంచుతున్నారని రావు వుద్దేశ్యం.

"తెలుసండీ... ప్రెజంట్ మార్కెట్లో రేట్లు పెరక్కుండా ఎలా వుంటాయండీ... రేపో, ఎల్లుండో మీరు మటుకు పెంచరా..." అన్నాడు కామేశ్వర్రావు.

రావు మరోసారి కామేశ్వర్రావు వేపు చూశాడు.

"కైలాష్ వాళ్ళ ప్రొడక్ట్ మీ ప్రొడక్టంత పాపులర్ కాదని చిదంబరంగారికి వాళ్ళముందే చెప్పానండీ... కాంటాక్ట్ చెయ్యటానికి వచ్చిన వాళ్ళల్లో వాళ్ళ ఎడ్వర్టైజింగ్ డైరెక్టరు కూడా వున్నాడు. వాళ్ళ కొత్త కొత్త ఏడ్సన్నీ చూపించాడండీ... నిజానికి చాలా ప్రామిసింగ్గా వున్నాయి. వెధవది కొనేవాళ్ళకి హంగే కదండీ కావాలి" అన్నాడు కామేశ్వరరావు తిరిగి.

ఆ పొడుగాటి ముక్కు బద్దలు కొట్టాలనిపించింది రావుకి. ఇంక ఏవేవో పాయింట్స్ వెతకటం

అనవసరం అని తేల్చుకున్నాడు.

"సరే అయితే చిదంబరంగారు, మనకి ఎప్పట్నుంచో వున్న వ్యాపార సంబంధాల గురించి మీకు నేను చెప్పాల్సిందేమీ లేదు. పైగా ప్లేస్ చేసిన ఆర్డర్‌ని కొద్ది పెర్సంటేజి కోసం మానేయటం సెంటిమెంటల్‌గా నాకిష్టం వుండదు. స్పెషల్ కేస్ కింద మరో ఫైవ్ పెర్సంట్ యివ్వమని మా మేనేజర్‌కి చెపుతాను..." అన్నాడు రావు.

చిదంబరం ఏం మాట్లాడలేదు. కొద్దిగా ముందుకి వంగటం తప్ప.

"థాంక్యూ రావుగారు, కానీ విషయమేమిటంటే ఈ ఒక్క ఆర్డర్‌తోటి అయిపోయేది కాదు కదండీ... అటు కైలాష్ వాళ్ళకి యింకా మాటివ్వకపోయినా కొంత కమిట్ అయినట్టే. యింత కాకపోయినా కొద్దో గొప్పో ఆర్డర్ వాళ్ళకీ కొన్నాళ్ళు యివ్వక తప్పదు... అందుకని మీరు అలాగే మరో ఫైవ్ పెర్సంట్...'
' అన్నాడు కామేశ్వర్రావు

"ఫస్ట్ యు గెటవుట్ మిస్టర్ కామేశ్వర్రావు..." అందామనిపించింది రావుకి. గబగబా బుర్రలో ఆ ప్రాడక్ట్ స్టాక్స్ అన్నీ కదిలాయి. ప్రస్తుత మార్కెట్‌ని బట్టి ఎక్కువ స్టాక్ చెయ్యటం ఏ రకంగానూమంచిది కాదని రావుకి తెలుసు.

అంత తొందరగా లొంగిపోవటం యిష్టం లేక ఏవేవో చెప్పినా చివరికి రావుకి, మొత్తంమీద యిదివరకటి కన్నా ఎడిషనల్‌గా ఎయిట్ పెర్సంట్ యివ్వటానికి వొప్పుకోక తప్పలేదు.

బోల్డన్ని నవ్వుల్ని వొదిలేసి.... మరో బోల్డన్ని నవ్వుల్ని పోగేసుకుని చిదంబరం, కామేశ్వర్రావు వెళ్ళిపోయారు.

కొద్ది కొద్దిగా చీకటి పడుతోంది.... వ్యవహారం తేలిపోయాక కలగాల్సిన ఆనందం కలగలేదు రావుకి.

"గద్ద ముక్కు వెధవ దగ్గర ఎంత నేకుంది" అనుకున్నాడు. ప్రతిభంతా పూర్తిగా కామేశ్వర్రావుది కాదని రావుకి తెలియక కాదు. పరిస్థితి, పెరుగుతున్న బిజినెస్ కాంపిటేషన్ రావు దృష్టికి రాకపోలేదు. ఇందులో వోటమన్న ప్రసక్తి లేదు. తను నష్టపోకుండా వుండాలంటే మరో కొత్త ఎత్తు వెయ్యాలి. అవసరం అయితే చిదంబరం కామేశ్వర్రావుని చేరతీసినట్టు, తనూ మరో వెంకట్రావునో, పుల్లయ్యనో దగ్గరికి తీయాలి. కానీ అలా ఏదో ఒకటి చేసేవరకూ ఈ టెన్షన్ వదలదని రావుకి తెలుసు... ఈ టెన్షన్ యిలాగే వుంటే ఏ పనీ, ఏ ఆలోచనా సాగదనీ తెలుసు. అందుకే వెంటనే రంగణ్ణి పిలిచాడు.

★ ★ ★

"రా.... వొచ్చి కూచో..." అన్నాడు రావు. సిగరెట్ యాష్ ట్రేలో పారెయ్యటానికి పక్క మీంచి కొద్దిగా పక్కకి వంగాడు.

మంచం పక్కనే కుర్చీ వున్నా, వొచ్చి రావు కాళ్ళవేపు మంచం మీద కూచుంది శాంత.

మరో సిగరెట్ కాలుస్తే అనిపించింది రావుకి... కానీ అప్పటికే వరుసగా నాలుగైదు సిగరెట్లు కాల్చటం వల్ల గొంతంతా వికారంగా అనిపించింది.

"బాగా చిరాగ్గా వున్నట్టున్నారు..." అంది శాంత.

"అబ్బే అదేం లేదే..." అందామనుకున్నాడు రావు. కాని తనని తను అలా మరుగుపరచుకోవాల్సిన అవసరమేం కనిపించలేదు. వొద్దనుకుంటున్నా చిదంబరం కామేశ్వర్రావుల మీదకే పోతోంది ఆలోచన.

వాళ్లు ఈ సమయంలో ఫీలయ్యే విక్టరీయే గుర్తొస్తోంది.

మనసుని ఆ విషయం మీంచి మరల్చటం కోసం శాంత వేపు చూస్తూ కూచున్నాడు. మోకాళ్ళ మీంచి పై భాగమే కనిపిస్తోంది. కాళ్లు మంచం పక్కగా వున్నాయి. ఆడాళ్ళ శరీరం రావుకి కొత్తకాదు. కానీ కొత్తదనం ఏదో వెతికి పట్టుకోవాలన్నట్టు చూశాడు శాంత వొంటినంతటినీ.... లైటు మరీ అంత దూరం లేకపోయినా దూరంగా వున్నట్టనిపించింది రావుకి. మంచం మీంచి లేద్దామా అనుకున్నాడు.

గదిలోకి రంగడు రావటం చూసి శాంతే లేచి నిలబడింది.

"నీళ్ళు పెట్టావా" అంది.

అవునన్నట్టు తలూపాడు రంగడు.

"ముందు వెళ్ళి స్నానం చేసిరండి..." అంది.

ఒంటిమీద వేడినీళ్ళు పడుతున్నంత సేపూ హాయిగా, ఆలోచనలన్నీ దూరంగా వున్నట్టనిపించాయి రావుకి.

బాత్‌రూమ్‌లోంచి వొచ్చి కాసిని మంచి నీళ్ళు తాగి ఇందాకటి లాగే మంచం మీద కూచున్నాడు. శాంత కూడా మంచం మీదే కూచుని ఏవేవో కబుర్లు చెప్పింది.

రంగణ్ణి బజారు పంపుతూ ఏవేం తేవాలో చెప్పింది.

రంగడు బజార్నించి వచ్చాక భోజనాలు అవీ తనే ఎరేంజి చేసింది.

ఆ తర్వాత నాలుగైదు గంటల్లో శాంత చేసిన ప్రతి పనీ యిష్టంగానే అనిపించింది రావుకి. రాత్రి గడుస్తున్న కొద్దీ ఆలోచనల్తో కుస్తీ పట్టే అవస్త తగ్గుతూ వొచ్చింది.

లైటు లేకపోవటం వల్ల కిటికీ లోంచి లోపలికొస్తున్న వెన్నెల స్పష్టంగా కనిపిస్తోంది. శాంతలో ఏమాత్రం తొందరపాటు, వెకిలితనం కనిపించలేదు రావుకి. పక్కగా తిరిగి శాంత వేపు చూశాడు. వెన్నెల వెలుగులో శాంత ముఖంలో కొంతభాగమే కనిపిస్తోంది.

"ఏం నిద్దరొస్తోందా" అన్నాడు.

లేదన్నట్టు తలూపింది.

"సాయంత్రం నేనున్న మూడ్‌కి ఈ రాత్రి యిలా గడుస్తుందనుకోలేదు" అన్నాడు రావు.

"ఏం బిజినెస్ గొడవలేనా" అంది శాంత కొద్దిగా లేస్తూ.

అవునన్నట్టు తలూపాడు.

"బాగా నష్టమా" అంది.

మామూలు సమయంలో అయితే సాయంత్రం గడిచిన వ్యవహారమంతా ఎవరితోటి చెప్పక పోయేవాడేమో, అదీగాక శాంతతో చెప్పినా ఏం నష్టం లేదన్న నమ్మకముంది. అంతకు ముందు కొన్నాళ్ళ పరిచయముంది శాంతతో. అందుకని చెప్పాడు.

"సాయంత్రం జరిగిందానికి కాదు. అది తట్టుకోలేనంత నష్టమేం కాదు. కాని యిది యిక్కడితో వీళ్ళొకళ్ళతో ఆగకపోతే మటుకు నష్టం" అన్నాడు.

"మరి దీన్ని యిక్కడితో ఆపలేరా" అంది శాంత. నిజానికి శాంతకి ఆ బిజినెస్ విషయాలేం అఖ్ఖర్లేదు, అర్థం కూడా కావు.కాని ఏదో ఒకటి మాట్లాడాలి. ఆ మాటలు రావుకి నొప్పి కలిగించకూడదు.

"ఆపగలమా లేదా అని కాదు, ముందు ముందు చెయ్యాలనుకున్నవన్నీ ఈ చిన్న గొడవ వల్ల

ఆలశ్యమవుతాయి. ప్రోగ్రాం దెబ్బ తింటుంది. అనుకున్నది అనుకున్నట్టు జరక్కపోతే నాకు చెడ్డ చిరాకు" అన్నాడు.

శాంతేం మాట్లాడలేదు.

అనుకోకుండా రావు కళ్ళముందు కామేశ్వర్రావు ముక్కు కదిలింది. 'వెధవ అనవసరంగా లేనిపోని గొడవ తెచ్చాడు. లేకపోతే యిప్పుడప్పుడే ఈ విషయం గురించి ఆలోచించే పనుండక పోయేది. ఇప్పుడు దీనివల్ల న్యూ ప్రాడక్ట్ ప్లాన్స్ కూడా మార్చాలి. ఈ డిస్కౌంట్‌లో తేడా యిక్కడితో ఆగుతుందో లేకపోతే మిగిలిన అందరు డిస్ట్రిబ్యూటర్స్ వరకూ పాకుతుందో'

శాంత కొద్దిగా కదిలి, "ఏమిటి మళ్ళీ ఆలోచన" అంది.

ఆ మాటతో కాని, బిజినెస్ తాలూకు న్యూసెన్స్ మళ్ళీ తనని కమ్ముకుంటోందని గ్రహించలేదు రావు.

"అబ్బే ఏం లేదులే" అంటూ నెమ్మదిగా శాంత వేపు జరిగాడు, ఇందాకటి కన్నా తేలిగ్గా వుంది రావుకి. అంతవరకు అణచి పెట్టినట్టున్న మనసు మరింత ఫ్రీగా వున్నట్టుంది.

శాంత కూడా యిందాకటికన్నా ఎక్కువగా మాట్లాట్టం మొదలెట్టింది. ఇద్దరూ కలసి రాజీపడే ధోరణిలో వున్నారు కాబట్టి వొకళ్ళమాటలు వొకళ్ళు వింటంలో యిబ్బందేం పట్టంలేదు.

అంతకు ముందు రాత్రి కూడా నిద్దరలేక పోవటంవల్ల శాంతకి కొద్దిగా నిద్ర రావటం మొదలెట్టింది. దాని నుంచి తప్పించుకోటానికి ఏవేవో మాట్లాడుతూనే వుంది. తన తాలూకు గొడవల్నించి దూరంగా వుండటం కోసం రావు వింటూ పడుకున్నాడు.

తన గురించి తన గత జీవితం గురించి చెపుతున్నానన్న విషయం శాంతకి తట్టనేలేదు. రావు తన బిజినెస్ గొడవలు చెప్పినట్టే తనూ తన గురించి చెప్పుకోటం మొదలెట్టింది. వొళ్ళమ్ముకునే అందరి ఆడాళ్ళ బతుకులో వున్నట్టే శాంత బతుకులో కూడా కష్టాలు చాలా వున్నాయి. ఆ క్షణానికాక్షణం చచ్చిపోతే చాలనుకున్న రాత్రుళ్లు చాలా వున్నాయి. తల్లి చావుబతుకుల్లో వున్నా మందులకోసం, తిండి కోసం బిజినెస్ చేసిన రోజులు చాలావున్నాయి. శాంత మరో ఆలోచన లేకుండా ఏవేవో చెపుతూనే వుంది. అలా చెపుతుంటే రావుకన్నా ఎక్కువ రిలీఫ్‌గా వుంది శాంతకి. ఆ వూరటలో..... కేవలం ఆ రాత్రి గడపటానికే తను వచ్చానన్న విషయం తెల్లారితే తనకీ, రావుకీ ఏమాత్రం అనుబంధం వుండదన్న విషయం మరిచిపోయింది శాంత.

వింటూ వింటూన్న రావు నెమ్మదిగా కదిలాడు. శాంత నుంచి కొద్ది దూరంగా జరిగి...

"యింక తెల్లారిపోయేలా వుంది పడుకోకూడదూ" అన్నాడు, అని అటువేపు తిరిగి పడుకున్నాడు.

శాంతికి విషయం అర్థమవటానికి ఎంతోసేపు పట్టలేదు. "తన కంటే తప్పదు. తను ఏ రాత్రి ఎవరితో గడిపినా వాళ్లు చెప్పింది వినాలి. అది తన స్వంత విషయంలాగే వినాలి. అది తన బతుకు... కానీ వాళ్ళకా అవసరం ఏముంది. రావుకీ అంతే. తన కష్టాలు అతని బిజినెస్ కేం వుపయోగపడవు. తన చావుబతుకులు అతని కే రకంగానూ సరదాగా వుండవు. అలాంటప్పుడు తను బాధపడకూడదనుకుంది. నిద్దరపోవాలనుకుంది శాంత, కానీ తెల్లారిపోయినా రెండింటిలో ఏదీ చెయ్యలేకపోయింది.

రాత్రి అలసట పూర్తిగా తగ్గాక నిద్దర లేచాడు రావు. రాత్రి పొందిన రిలీఫ్‌కి బాకీ ఏం

వుంచుకోకూడదనుకున్నాడో ఏమో బాగానే ముట్ట చెప్పాడు శాంతకి.

నవ్వుతూనే తీసుకుంది శాంత. మిగిలిన విషయాలన్నీ మరిచిపోతే మంచి బిజినెస్సే చేశాను' అనుకుంది.

ఈ బిజినెస్‌కి రక్తం, మాంసం, కన్నీళ్లు, అవమానాలు పెట్టుబడన్న విషయాన్ని దృష్టికి రానివ్వలేదు శాంత. రావు లెఖ్ఖ వెయ్యగలిగినట్టు ప్రతి చిన్న యిబ్బందినీ.... టెన్షన్నీ ఎప్పుడో రాబోయే కష్టనష్టాల్ని లెఖ్ఖ ఎంతమాత్రం వెయ్యలేకపోయింది శాంత.

• *ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 13-6-1975*